కథానిక:

లోగుట్టు.

• శ్రీ ఘట్టి కృష్ణమూర్తి •

నాన్న చెప్పినమాట నిస్పృహ కలిగించింది; బాబాయ్‌తో సంప్రదిద్దామని బయటకువచ్చేశాడు ప్రభాకర్. బాబాయ్ దగ్గరవున్న చనువు నాన్నదగ్గర లేదు. బాబాయ్‌తో తను ఏవిధంగానైనా వాదించగలడు నాన్నమాట వినడం తప్ప ఆయనకు ఎదటబడి సమాధానం చెప్పి యెరగడు.

అన్నయ్య దగ్గర అసలే చనువులేదు. మొదణ్ణించీ—చదువుకుంటున్న నాటినుంచీ—అన్నయ్య అంటే భయమే. మనస్సువిప్పి అంతగా మాట్లాడడు. నిజానికి అది భయమూ కాదు. మరి, మనసులోని యీ మూకీభావానికి అర్థం ఏమిటో అతనూ చెప్పలేడు.

తను ఇంటిదగ్గరవుండి నాన్న, అన్నయ్యల అదుపులోనే చదువుకున్నా, ఎటొచ్చీ ఉద్యోగంవచ్చి ఆరు నెల్లయింది పెళ్లయి నాలుగు నెలలు మాత్రమే

బాబాయ్‌కూడా ఇందుకు ససేమిరా అంటే తరువాత సంగతి తనే ఆలోచించుకుని భావినిగురించి ఒక నిర్ణయం చేసుకుంటాడు. అందుకు ఆమె కూడా అంగీకరిస్తుందా అని సంశయించేందుకు హేతువులేదు.

అతనికంటె ఆలోచనలే పందెంవేసుకుని పరుగులెత్తుతున్నయ్ సైకలుకు వేగం హెచ్చించి రివ్వునవచ్చి వాలాడు, బాబాయ్‌గారి ఇంటదగ్గర

బాబాయ్ అరుగుమీద కూచుని తాపీగా, "భారతం" కాబోలు చదువుకుంటున్నాడు సైకిలుకు స్టాండు వేసి చకచకా ఇంట్లోకి వచ్చేస్తున్నాడు ప్రభాకర్. పుస్తకంలోనించి తలెత్తిచూశాడు బాబాయ్. "ఆఁ. నువ్వేనా! ఎప్పుడువచ్చావురా ప్రభాకరం?" అన్నాడు, కళ్లజోడు ముక్కుచివరికి లాక్కుంటూ

"పొద్దున పదిగంటలబండీకే వచ్చాను బాబాయ్. పిన్నేది సావిత్రీవాళ్లూ ఎక్కడకు వెళ్ళారు? అక్కయ్య దగ్గిర్నుంచి ఉత్తరాలు వస్తున్నాయా? గిరిజ ఆడుకుంటూందా?" అన్నీ ఒక్కగుక్కలో అడిగేశాడు ప్రభాకర్ పక్కనేవున్న బల్లమీద కూచుని బూట్లు విప్పుకుంటూ.

చదువుతూన్న పుస్తకంలో చిన్న కాయితంముక్క ఆనవాలుపెట్టి కళ్ళజోడు పెట్టెలోపెడుతూ, "ఏమేవ్, ప్రభాకరం వచ్చాడు" అని కేకవేశాడు బాబాయ్, పిన్నికి వినబడినట్లు లేదు.

"ఇప్పుడే వస్తాను బాబాయ్" అంటూ ప్రభాకరం లోనికి వెళ్ళిపోయాడు బాబాయ్ కూడా అతని వెనకాలే ఇంట్లోకి వెళ్లాడు పుస్తకం చేతపట్టుకొని.

ప్రభాకరానికి స్వంతయింట్లోకంటే ఇక్కడే చనువు ఎక్కువ బాబాయ్‌కి మొగపిల్లలు లేకపోవడంవల్ల చిన్నప్పణ్ణించీ ఇతడంటే మిక్కిలి మక్కువగా చూస్తూండేవాళ్లు, కొన్నాళ్ళవరకూ ఇక్కడే ఉండిపోతూ వుండేవాడు కూడా

ఇహ చదువుతున్నన్నాళ్ళూ మధ్యాహ్నం అన్నానికి ఇంటికి వెళ్ళేవాడుకాదు, రాత్రిళ్లు అన్నంతినొచ్చి ఇక్కడే పడుకొనేవాడు అతగాడికి ఈ యింట్లో ప్రత్యేకం వోగది పిన్ని ఎక్కడకువెళ్ళినా తనూ తయారు.

పిన్ని దొడ్డివసారాలో కూచుని అప్పడాలు వొత్తుకుంటూంది. ఇంకా యెవరో కూడావున్నారు. దూసీచూడడంతోనే "ఏరా ప్రభాకరం, ఇదేరావడమా?" అనడిగింది ఆప్యాయంగా నవ్వుమొగంతో. "లేదుపిన్నీ! మధ్యాహ్నమే వచ్చాగానీ, కాస్త నాక్కూడా పెడుదూ!" అంటూ చెయ్యిచాచాడు ప్రభాకర్ నిమ్మకాయంత ఉండ చేతిలోవేస్తూ "అక్కడ ఎట్లావుంటుంది? భోజనం అదీ బాగుంటుందా?" అనడిగింది పిన్ని ఆమె గొంతులో వాత్సల్యం తొణికిసలాడింది ఇంతలో బాబాయి పిలుపువిని ఇవతలకు వచ్చేశాడు

కొంతసేపు "పిచ్చాపాటీ మాటాడుకున్న తర్వాత తాను వచ్చిన అసలు సంగతి బయలుపెట్టాడు ప్రభాకరం

బాబాయ్ విని ఊరుకున్నాడు. ఏదో ఆలోచిస్తున్నట్టు పరధ్యానంగా మరోవైపుకు చూస్తూ ఉండి పోయాడు

ఆయన్ను తిరిగి సంభాషణలోకి గింపే ఉద్దేశంతో "అవును బాబాయ్ నేనూ విచారించాను. వచ్చేదశమినాడు చాలా బాగుందన్నారు ఏమంటావ్?" అన్నాడు ప్రభాకరం అతని గొంతులో తొందర వినబడింది బాబాయికి

"లేడికి లేచిందే ప్రయాణమట్రా?" అన్నాడు గొంతు తగ్గించి, కాస్త మందలింపుగా

"మీకేం అలాగే అంటారు ఉద్యోగం వచ్చేదాకా రాలేదనుకుంటాం. వచ్చింతర్వాత ఒక్కడూవుండి అక్కడ నిభాయించుకోడం ఎంత కష్టమనుకున్నావ్? ఆ హోటలు భోజనం నా ఒంటికి సరిపడక నానా అవస్థా అయిపోతోందనుకో! అన్నింటిలోనూ డాల్డా తగలేస్తాడు బాబాయి. దగ్గుతో చచ్చిపోతున్నాను. పగలూ, రాత్రీ పేగులు తెగిపోతున్నాయి. ఆఫీసులో పనికూడా తెమలడంలేదు దీని మూలంగా."

వోసారి చిన్న దగ్గుదగ్గి తిరిగి చెప్పుకపోతున్నాడు. "ఇంకా కొంతకాలం ఇలాగే గడిపితే కడుపులో పెద్ద వ్యాధి ఏదో బయల్దేరేట్టుంది. మనం యెక్కడున్నా ఒంటరిగావుండి ఇలాంటితిళ్లకు అలవాటు పడ్డామా యేమన్నానా, ఏమంటావ్ బాబాయ్?" బాబాయ్ వంక చూశాడు. "వ్యాధి" మాటవినేసరికి ఆయన గుండెల్లో గతుక్కుమన్నట్టయింది పిన్నికూడా పక్కన వున్నదేమో అని సావిట్లోకి చూశాడు ఆమె నిజంగా ఈమాటవింటే ఎంతో నొచ్చుకుంటుందని బాబాయికి తెలుసు ప్రభాకరాన్ని కడుపులోపెట్ట పెంచుకున్నట్టు చూసుకుంటుందనీ తెలుసు అందుకనే సమాధాన ధోరణిలో ఇలా అన్నాడు—

"అదీ నిజమేరా అబ్బాయ్ నేనుమటుకు ఏలా కాదంటాను? ఆరోగ్యం సంగతిముందుగా ఆలోచించుకోవలసిందే అనుకో! అయినా మీ నాయనతో చెప్పి చూడు నేనైనా అంతేగా చేసేది?" అని తనకేమీ పట్టనట్టు ఊరుకున్నాడు.

ఆయన ముద్రతో వ్యవహారమంతా నడిచేది తనే అయినా ఇలా పెద్దరికంచూపి మాటాడడం ప్రభాకరానికి కష్టంవేసింది కాని తమాయించుకుని అన్నాడు. "చెప్పాను బాబాయి, ఆయన అప్పుడే తెమలనిచ్చేలాలేడు. ఇంకా మూణ్ణెల్లు—జ్యేష్ఠమాసందాకా—ఆగితే గాని అన్నీ సక్రమంగా కనగూడి రావంటాడు. ఇంకా యెన్నాళ్లని ఇలా బాధపడమంటావ్?"

"అవును గ్రహాపొంతనం కుదరడమంటే అది వోపట్టాన అయేదికాదు!"

"ఏదో సరిపెట్టుకు పోవాలి గాని, మనకు గ్రహాలేమిటి బాబాయ్?"

"అలా అనకు. అన్నిటితోపాటు అదీ అవసరమేమరి!"

"అయితే అంతవరకూ మీ నమేషాలు లెక్కపెట్టుకుంటూ కూచుంటామా? నాన్న ఎప్పుడూ అలాగే అంటాడు. నేడు ఈ గడపకదిత్తే గ్రహబలంకోసం పంచాంగాలు తిరగవేస్తాడు. ఏమీలేదు బాబాయ్, నువ్వుపట్టుపట్టి 'ఇది ఇలా జరిగితీరాలి' అంటే ఆయన అభ్యంతరంచెప్పడు"

"అలా యెన్నడైనా అన్నానురా నేను? నీకు తెలీదూ? మొదణ్ణించీ ఆయన అదుపులో వున్నట్టుగానే పెరిగాంగాని, ఏ విషయంలోనైనా ఆయన్ను మెడలు విరిచి ఒప్పించామా?"

ఇదంతా ఒకటే మచ్చురా బాబూ అనుకున్నాడు ప్రభాకర్ అయినా మరికొంతసేపు ప్రయత్నించి చూదామనుకున్నాడు. "అదికాక, అన్నప్పుడూ మనకు సెలవు కావాలంటే దొరుకుతుందా చెప్పు బాబాయ్ ఉద్యోగం చేస్తున్నవాడివి నీకు తెలుసుగా దానిలో కష్టసుఖాలు." అని అన్నాడు

"సరే—అంతవరకూవస్తే నాలుగు రోజులు సెలవు పుట్టించలేక పోతామా?" అన్నాడు బాబాయ్ మాటకు అడ్డువచ్చి. ఇంక ఏమనాలో తోచలేదు, ఆలోచిస్తున్నాడు ప్రభాకర్ బాబాయే అంటున్నాడు—

"చూడు. నీకూ చిన్నతనం-ఇలాంటి విషయాలేవీ తెలియవు ఎటొచ్చీ, పెళ్లిఅయి నాలుగునెలలే కదా అయింది! అయినా వాళ్లకులేని తొందర మనకెందుకు చెప్పరా!" ఇదొక పెద్దయుక్తిగానే కనబడింది బాబాయ్‌కి ప్రభాకర్‌కో కొంచెం నస్కారం అంటుకుంది.

లోగుట్టు

"ఎవరికివారు అలాగే వూరుకుంటే మధ్య బాధపడేది నేనుగా కనుపిస్తున్నాను. ఇందులో ఒకళ్ళొకళ్ళు బిర్రబిగిసి కూర్చోడానికి తగిన కారణం కనబడదు మనం అడిగితే వాళ్ళుమటుకు కాదంటారా బాబాయ్?" అని అన్నాడు.

"మనం నోరుచేసుకు అడిగితే బయటపడ్డామన్నమాటే!"

"నువ్వు చెప్పేది మరీ విచిత్రంగావుంది. ఎవడి పెళ్ళాన్ని వాడు పంపమని అడగటంలో బయటపడి పరువు చెడాల్సినంత అగత్యం ఏమొచ్చిందంట?"

"నువ్వొక్కడవు కాదనుకుంటేసరా? లోకులు ఏమంటారని అదిమాత్రం ఆలోచించుకోవద్దూ?"

"ఇందులో లోకుల ప్రసక్తి ఏముంది?"

"ఏమివున్నా లేకపోయినా మనంచేసే ప్రతిపనికీ ఒకవంక లోకులకు వెలుస్తూనే వుండాలి. లేకపోతే మనిషికి విలువ ఉండదురా అబ్బాయీ! ఇప్పుడయినా ఆలోచించుకో, మీ నాయన ఎంత దూరాలోచనతో అన్నాడో ఆమాట!"

"ఆయన మనస్సులో మొన్నెంచీ ఒకటే ఆలోచన-వాళ్ళు ఇస్తామన్న మూడువేలూ ఎలాగైనా గోళ్ళూడగొట్టి వసూలు చెయ్యాలని. అంతేనా?"

"అవును—అందులో అపసవ్యమైనపని ఏమున్నదంట? వాళ్ళు ఇస్తామన్నమాటకు కట్టుబడి ఉండొద్దూ?"

"ఇస్తే ఇస్తారు లేకపోతేలేదు వాళ్ళు ఇస్తేగాని మనకు గడవదా ఏమిటి? అంత బలవంతాన పీకమీద కూచుని గుంజుకోకపోతే ఉన్నకాస్త పరువు తీసేసుకోవడమేనా మరేమైనా ఉందా?"

"అదేమన్నమాటరా! వ్యవహారానికి వ్యవహారమే, మంచికి మంచే-దేని అదను వచ్చినప్పుడు దాన్ని కటిక్కిన నొక్కకపోతే ఎవ్వరూ జనినీ నెగవెయ్యలేరన్నకో! నీకూ కుర్రతనం గాని అన్నయ్యాను అడిగిచూడు! చెవులు మెలేసి మరీ పుచ్చుకున్నారు. వదిలిపెట్టారనుకున్నావా?"

"మూడువేలూ కట్నం ఇచ్చాడుగా! ఇంకా యెందుకు ఈగలాగ పీక్కుతినడం?"

"తక్కింది ఇచ్చుకుంటానని నలుగురియెదటా సభలో వప్పుకున్నాడు"

"కావొచ్చు-మనం చదువు మానేశాంగా బాబాయ్!"

"ఆసంగతి తనకెందుకు? ఇస్తానన్నది ఇచ్చెయ్యాల్సిందే! మనం నోరు మూసుకుంటే లోకం నోరుమూయగలమట్రా అబ్బాయ్?"

"మనం వద్దంటే లోకమైనా వసూలుచేసి తీరుతుందా బాబాయి?" ఆవేశాన్ని అణచుకున్నట్టు అదోలా ప్రశ్నించింది అతనిగొంతు బాబాయి మొహంలోకి పరకాయించి చూశాడు.

"మనం వద్దనడమేమిటి అసలు? ఇదెంత తెలివితక్కువ మాటా?" అని బాబాయి మొహం చెప్పకనే చెప్తోంది. తననుగురించి తనకు తెలియకుండా తెరవెనుక ఎంత భాగోతం జరుగుతోందో, అట్టే ఊహించుకోలేకపోయాడు ప్రభాకర్. ఏదో జ్ఞాపకం చేసుకొంటున్నవాడిలా తలపట్టుకుని గిజాటుగా ఆలోచించుకుంటున్నాడు బాబాయి తనను హెచ్చరించే ధోరణిలో ఇలా చెప్పుకు పోతున్నాడు.

"నువ్వు మధ్యమధ్య శని, ఆదివారాల్లో వాళ్ళఇంటికి వెడుతున్నట్టు తెలిసింది. అదెంత పరువు తక్కువపనో గ్రహించావా? చివరికి మనల్ని గడ్డిపోచకింద కడతారు సుమా! నీకు తెలియదు చిన్నతనం వ్యవహారరీత్యా అన్నీ సక్రమంగా ఫైసలయితేగాని అలాటివన్నీ మనకు పనికిరావు. అంతవరకూ మనం మన తాహతుకు భంగం కలగకుండా చూచుకోవాలి" గ్రహించావా అన్నట్టు అతనివంక గంభీరంగా చూచి ఊరకున్నాడు బాబాయి

"ఎన్నాళ్ళకు ఫైసలవుతుందంటావ్?" ప్రభాకర్ మాటకుమాట అడిగాడేగాని, అతనిమనసు మనసులోలేదు.

"అదంతా మీ నాయన వ్యవహారం నడుపుకురావడంలో ఉంది ఆయన మాత్రం సామాన్యుడా? ఒకమాట—ఇస్తారులెమ్మని ఇలాగే పాదివేతగా వూరుకుంటే ఏళ్ళూపూళ్ళూ గడిచిపోతై. వ్యవహారంలోకిదిగి దానికి తగిన పద్ధతిలో నడుపుకొస్తే, మర్నాటికల్లా గవ్వలు రాలినట్టు రాలి పడవూ?"

బాబాయి మాటలు వింటూంటే నిజంగా అంతపనీ చేసేట్టే అగుపిస్తున్నాడు. తనకు ఏదో ముళ్ళకిరీటం నెత్తినపెట్టి తపీతపీ బాదుతున్నట్టున్నది. "సరే-నేను వెడతాను బాబాయి" అంటూ చివాల్న లేచి కాళ్ళకు బూట్లు తొడుక్కుంటున్నాడు.

"రేపు ఉంటావా?" అనడిగాడు బాబాయి, గొంతు సవరించుకొంటూ.

"ఊహూ—రేపు సోమవారం కదూ. ఆఫీసుకు వెళ్ళిపోవాలి. మొదటిరైలుకే వెడతాను" అంటూ సైకిలెక్కేసరికి దూసుకున్నాడు. బాబాయి వెనకనించి చూస్తూ "పట్టికుర్రకుంకలు, వీళ్ళకేం తెలుసు?" అన్నట్టు తనలో తనే, తలపంకించి వోచిన్ననవ్వు నవ్వుకున్నాడు

* *

"..సరే. అక్కడ అన్ని ఏర్పాట్లూ చేసివచ్చాను, రేపు ఉదయమే మన ప్రయాణం ఏమంటావ్?" అన్నట్టు ఆమె కళ్ళల్లోకి చూశాడు ప్రభాకర్ ప్రశ్నార్థకంగా.

వరలక్ష్మి వయ్యారంగా ముద్దుగా మునివేళ్ళతో పుచ్చుకుని కాఫీగ్లాసు అందివ్వబోయిందతనికి. అందుకుంటున్న వాడల్లా చెయిసగం వెనక్కులాక్కుని "ఆఁ,ఆఁ...వదిలిపెట్టకు, గ్లాసుకింద పడిపోతుంది" అంటూ రెక్కలు తెరచివున్న అల్మరాలోకి అదేలా తేరిపారజూశాడు. అక్కడ పడివున్న కవరుమీద వ్రాసిన దస్తూరీ అతణ్ణి విచిత్రంగా ఆకర్షించింది. చటాల్న లేచివెళ్ళి ఆకవరు తీసుకున్నాడు. అది చింపివున్నది.

ఆదస్తూరీ తను ఎక్కడో చూచినట్టున్నది. ఆదస్తూరీతో వ్రాసిన ఉత్తరాలు తను చాలాచదివినట్టున్నాడు. ఉత్తరాలేకాదు, ఆదస్తూరీ తనకు పాఠాలు నేర్పినట్టుంది. తను ఎరిగున్నంతలో ఇలాటి వ్రాత బాబాయి వ్రాయగానే చూశాడు. ఇది ముమ్మాఠిత్తులా ఆయన వ్రాత అనుమానంలేదు.

అతని చూపులు ఆకవరుమీదనే అతుక్కుపోయినై. అతనికళ్ళు కనబడని అక్షరాలకోసం, అంకెలకోసం ఆదుర్దాగా వెతుక్కుంటున్నయ్ తన చేష్టలు ఏమిటో అర్థంకాక తన్నుకులాడుకుంటున్న వరలక్ష్మి చేతికందించబోతూన్న కాఫీగ్లాసుతో భరతనాట్యంలో భంగిమలా అలాగే చలనంలేకుండా నిలబడి చూస్తున్నది.

టిక్కుటిక్కుమనే గడియారం కదలికలుతప్ప ఆగది అంతా నిశ్శబ్దం కమ్ముకున్నది వోక్షణంపాటు.

"అమ్మాయీ, వరలక్ష్మీ!" అనే వంటావిడ పిలుపు గడియారం గంటకు వంతపలికింది. ఆనిశ్శబ్దాన్ని భంగిస్తూ,

"వస్తున్నా" అన్నది వరలక్ష్మి, అతను తలెత్తిచూశాడు.

"కాఫీ బొత్తుగా చల్లారిపోయిందండీ! ఇప్పుడే వెచ్చబెట్టుకొస్తాను" అంటూ అక్కణ్ణించి కదలివెళ్ళింది వరలక్ష్మి వెనుకనించి వాలుజడ ఈవెర్రి ప్రపంచాన్ని వెక్కిరిస్తున్నట్టున్నది.

అంకెలు, అక్షరాలకోసం ఆరాటమేకాని అవి స్పష్టంగా కనుపించనేలేదు. కనుపించిన వాటిని కూడబలుక్కుంటూ కూడికలు వేసుకుంటూ ఏవేవో ఆలోచనలు అల్లుకుంటున్నాడు ప్రభాకర్.

ఆ కవరుమీద అలికేసినట్టు కనుపించే అంకె 25 అయ్యుంటుందని నిశ్చయించుకొని 'డైరీ'లో వ్రాసుకుంటున్నాడు, నిన్నటి తారీఖు 25 ఇది బాబాయి వ్రాసినట్టు నిర్ధారణ అవుతోంది.

ఇంతలో కాఫీగ్లాసుతో వరలక్ష్మి తిరిగి ప్రత్యక్షమయింది. వేడివేడి కాఫీ పొగలువస్తూ గ్లాసులో కనుపించగానే అతనికీ ప్రాణం లేచివచ్చినట్లయింది ఘ్రాణేంద్రియం అంతకుముందే ఉవ్విళ్లూరింది చేతులోవున్న కవరు అల్మరాలోకి గిరవాటేసి గ్లాసు అందుకుని వెంట వెంటనే రెండు గుక్కలు పీల్చాడు.

"అమ్మయ్య, ఇప్పటికి ప్రాణం కుదటబడింది" అన్నట్లు తృప్తిగా వరలక్ష్మి మొహంలోకి చూశాడు. "పొద్దుణ్ణించీ గుక్కెడు కాఫీ అయినా దొరగనుగదా!" అన్నాడు మరోగుక్కెడు చప్పరించుతూ. "అయితే ఏమంటావ్ మన ప్రయాణం ఖాయమేగా?" ఖాళీగ్లాసు చేతికందిస్తూ అడిగాడు ప్రభాకర్.

గ్లాసు బల్లమీదుంచి దగ్గరసావచ్చి కూచున్నది వరలక్ష్మి. 'ప్రయాణం ఖాయమేనా? అని నన్నడుగుతారేం. నాన్నగారి నడగండి?" అని అన్నది.

"ఇది మరీబాగుంది, పైవారంనించీ ఇక్కడికి వచ్చేగాలేదు ఏమనుకుంటున్నావో, ఆలోచించుకో!"

"మీరూ ఆలోచించుకోండి, ఎలా రాకుండా ఉండగలరో?" తనమీద నెపం ఏమాత్రమూలేదని చెపుతున్న గొంతులా ఉన్నది.

"అవును అదీనిజమే ఏమిటిగతి?...సరే–నేనే అడుగుతాను నాన్నగారిని ఏమంటావ్?"

"అడగండి, ఎవరికోసం?" తెరమందుకు వేసుకుని రిబ్బనుముడి సవరించుకుంటూ తలవంచు పని మనస్సులో వ్యధ పడుతున్నట్లు అన్నది వరలక్ష్మి

"నాకోసము, నీకోసము–అవునా?" అని గెడ్డంపుచ్చుకుని ఆమె మొహంలోకి చూశాడు ప్రభాకర్. రెండు గుడ్లలోనీళ్ళు తిరగడం చూశాక అతనికి జాలేసింది చేతిరుమాలుతో కళ్ళు అద్దబోయాడు. వరలక్ష్మి అతనిచేయి పట్టుకుని ఇలాఅన్నది.

"మీ ఉత్తరంచూసుకుని నాన్నమరీ దిగులుపడ్డాడు. మీరు అలా ఎందుకురాయాలి? నాన్నమీద మీకంత కసి ఎందుకు?"

"నాకు కసేమిటి?" అతను వెలవెలబోయాడు.

"మరి యీ ఉత్తరం రాసింది మీరేగా!" రెవికలో వున్న ఉత్తరంతీసి అతని ఒళ్ళో పడేసింది.

"అవును, ఇది నేనే వ్రాశాను"

"దీనితోనే అసలు ఆయన కడుపు కోసుకుపోయేలా కుమిలిపోతుంటే, నిన్న. నే " చటుక్కున ఏదోజ్ఞాపకం వచ్చినట్టు నాలుక కరుచుకుంది వరలక్ష్మి.

"ఊ. చెప్పెయ్యి! ఇంకా దాచడమెందుకు? నిన్ననే బాబాయ్ ఉత్తరంకూడా వచ్చిందికదూ? ఇదిగో కవరు!" చివాల్న లేచి అల్మరాలో కవరుతీసి వరలక్ష్మి చేతికిచ్చాడు ఆకవరు చూసుకుని వరలక్ష్మి ఏమీమాటాడలేక పోయింది.

నిజంగా బాబాయి అలాగే వ్రాసి ఉంటాడు. అక్షరాలా తనతో అన్నట్లుగానే __అప్పుడు అతనిలో చిన్న తుపాను రేగింది. గుండెల్లో ఉరిమినట్టయింది, వెంటనే వోసగంతి మెఱుపులా మెరిసింది.–మొదటగా తానిక్కడికి వచ్చినప్పుడు వరలక్ష్మిని పిల్చి వాళ్ళనాన్న ఏదో చిన్న హెచ్చరిక చేశాడు. "ఆసంగతి అతనితో అనవోకు" అన్న మాటమాత్రమే తనకు వినపడింది. అది ఏమిటో ఆమెను అడిగి తెల్సుకోవాలనుకున్నాడు. ఆమె చెప్పలేదు. బ్రతిమాలాడు. ఒట్టుపెట్టుకున్నాడు. ఎలాగో ఆమెచేత పలికించాడు. ఆనాడు వరలక్ష్మి చాలాబాధ పడుతూనే చెప్పింది బాబాయి వ్రాసిన ఉత్తరం సంగతి. నాన్నగారి మనసు కూడా కష్టంకలిగినదని ఆమె మాటల్లోనే అర్థమయింది.

కొనాళ్లకు ఈసంగతి తను మర్చిపోయాడు ఇంతవరకూ తనకు తెలీకుండానే వియ్యన్నగారికి (మామగారికి) ఉత్తరాలు రాస్తున్నారు, నాన్నా బాబాయికలిసి. వరలక్ష్మి కూడా ఇన్నాళ్ళనించీ దాచిపెట్టింది. బాబాయి యీ డబ్బు సంగతి తనతో ప్రస్తావించగానే మనసులో ఏదో గుప్పుమన్నది ఈమాటే. అప్పుడే జరిగిందంతా జ్ఞాపకంరాగా గిజాటుపడ్డాడు.

వరలక్ష్మి కన్నీరు కుమ్మరిస్తూ చెప్పినమాటలు ములుకుల్లా గుండెల్లో గుచ్చుకుని తనలో ఏపాటి మానవత్వమైనా మటుమణిగి ఉన్నదేమో అని మూలమూలలా గాలించివేస్తున్నయ్. ఏదోభరింపరాని వ్యథ–

మానవత్వాన్నిగురించి పాఠాలు నేర్చుకుని ఉంటే తనకు కలిగిన యీవ్యధకు అర్థం, తాత్పర్యం చెప్పుకోకలిగేవాడు. ప్రస్తుతం తాను అనుభవిస్తున్నది వట్టిమూగబాధ–"

తానువ్రాసిన ఉత్తరమే వరలక్ష్మిని ఇంతగా కలచివేసిందేమో...ఏదో...తొందరలో అలావ్రాశాడు. బాబాయి చెప్పిన సమాధానం తనలో రేకెత్తించిన తీవ్రధోరణి నంతా యీ ఉత్తరంలో కలకబోసి వుంటాడు. ఆనాటి ఉదయమే రైలులో కూచుని వ్రాసింది, వ్రాసిందిగా తిరిగి చూడకుండా స్టేషనులో దిగగానే పోస్టుచేశాడు.

"ఎంత తొందరపాటు!!..."

తిరిగి వరలక్ష్మి ఇలా చెప్పుకుపోతోంది "పోనియ్యండి, మీకూ అంత తొందరెందుకు? మీఉత్తరం చూసుకుని నాన్న నిలువునా నీరైపోయారు. ఇప్పుడు ఈస్థితిలో నేను ఇక్కణ్ణుంచి రావడం ఆయనకు మరింత గుండెకోత. కాని ఇందుకు మీతోబాటు నేనూ బాధ్యురాలనే. అందుకే

ఆయన కళ్ళనిండా నీరునిండినా నాగుండె రాయిచేసుకుని రోజులు లెక్కపెట్టుకుంటున్నాను. నేనూ మీతోపాటు వచ్చెయ్యడానికే సిద్ధమౌతున్నాను. రేపు ఉదయమేకదూ మన ప్రయాణం?"

నిజంగా గుండె రాయిచేసుకునే అన్నట్టున్నవి వరలక్ష్మి మాటలు. బ్రతుకు బరువంతా వ్యథితహృదయం మీదకునెట్టివేసి లోనున్న విషాదతరంగాలను అణచుకుంటే అవి ఇముడక ఊటలు ఊరుకుంటూ పైకి ఉబికి వెల్లువలుగా పారుతున్నప్పటి సజీవ వాదాలు...

వరలక్ష్మి అతనివంక చూసింది. ప్రాథమిక దశను గడిచి గట్టెక్కని కళాకారుని చిత్రంలోలాగ అస్పష్టంగాను, అనభివ్యక్తంగాను అలుముకున్న ఆవేదనా సూచకమైన కొన్ని రేఖలు అతని మొహంలో ప్రాకులాడుతున్నట్టున్నయ్. చిత్తుపు యెదటనే సన్నచేసి నప్పటికంటె ఆమెకు మరేటి సమాధానమూ వినిపించలేదు. సంపుటంలో కడిగిపెట్టిన సాలగ్రామంలా నల్లగా నిగనిగలాడుతూ నీరు నిండిన అతని నల్లగుడ్డు నిశ్చలంగా నిలబడి చూస్తోంది.

వరలక్ష్మి మొహం వానకు తడిసిన అద్దంలోలా అలికి వేసినట్టు అతనికళ్లల్లో ప్రతిబింబించింది.

అతనూ తనమొహం చూసుకున్నాడు ఆమె కళ్లల్లో. వాళ్ళయిద్దరికళ్ళూ వర్ణాలులేని విలక్షణమైన భాషలో పరస్పరం పలకరించుకున్నయ్.

మొహాలలోని భావాలు హృదయాల అంతరాంతరాల వరకూ చొచ్చుకునిపోయి రొదపెట్టినయ్, వారి ఏకాంత జీవితానికి సాక్ష్యం పలుకుతున్నట్టు.

ఓ క్రమాలకి కిటికీలోంచిచూసి నాన్నవచ్చే వేళయింది, అంటూ చివాల్న లేచివెళ్ళింది వరలక్ష్మి.

తానూ సావిట్లోకివచ్చి కుర్చీలో కూలబడ్డాడు ప్రభాకర్.

3

వియ్యన్నగారిది నేటి మధ్యరకం సంసారాల్లో కాస్త మెరుగైనదనే చెప్పాలి. ఇద్దరే అన్నదమ్ములు. వియ్యన్నగారు రెండోవాడు. ఆయన వంతు పదిహేనెకరాల ఆస్తివచ్చింది. తల్లి ఇహాన్ని వీడగానే తనవంతు అట్టేపెట్టుకున్న నాలుగెకరాలూ అమ్మేసుకుని తీర్థయాత్రలు సేవించి తుదకు కాశీకి వెళ్ళి సన్యసించాడు తండ్రి.

వియ్యన్నగారికి వరలక్ష్మి ఒకర్తే ఆడపిల్ల, ఇద్దరు మొగపిల్లలు. పెద్దకూతురి పెళ్ళిముచ్చట చూసుకోకుండానే ఆయనభార్య లక్ష్మీకాంతమ్మగారు ఏణ్ణర్ధంక్రితం ఇహలోకం నించి దాటుకున్నారు. పండంటి సంసారం బుగ్గిపాలైంది.

వియన్నగార్కి విరక్తికలిగి ఉద్యోగం మానివేసి పిల్లల్ని కనిపెట్టుకుని ఇంటిదగ్గరే ఉంటున్నారు.

సంవత్సరన్నర తరువాత వరలక్ష్మికి పెళ్ళిచేయ తలపెట్టాడు. గుడ్డువిప్పితే కుంచెడు నీళ్ళుగా లక్ష్మీకాంతమ్మగారి రవిక బొడ్డులో పెట్టుకుని కన్యాదానం చేశారు.

ఆయన మనస్సుకు ఇప్పటికీ శాంతిలేదు.

ఇరవై వత్సరాల సుదీర్ఘసాంసారిక జీవితోదంతాన్ని స్మృతిపథకంనించి ఇట్టేతుడిచివేసుకోలేక కొట్టుమిట్టాడుతున్నాడు. వివాహంపేరు చెబితే విరియబూచిన మల్లెపొదలాంటి యెవరో మనిషి ఆయనచెంత నిల్చున్నట్టవుతుంది. ఏదో మైకం కమ్మినట్లు తలపట్టుకు గిజాటుపడతాడు.

ఇంట్లో వంటా-పెట్టూ అన్నిటికీ ఒక మనిషిని నియమించాడు.

ఇంతవరకూ ఆయన పునర్వివాహం మాటతలపడు. ఇక ముందు చేసుకుంటాడేమో తెలీదు. ఇప్పటికి ఆయన వయస్సు 42 సంవత్సరాలు—

మగపిల్లల్నిద్దర్నీ బజారుకు తీసుకువెళ్ళి ఏవేవో కొనిపెట్టి అప్పుడే వెంటబెట్టుకు తిరిగివచ్చాడు.

ప్రభాకరాన్ని చూడ్డంతోనే ఆయనకు అంతా అర్థమయింది. తనూ ఓ కుర్చీలో కూర్చుంటూ పలకరించాడు. "ఉదయం బండీకే వచ్చావా?" అని.

"అవును—మెయిల్లో వచ్చాను", అన్నాడు ప్రభాకర్ లేనినవ్వు తెచ్చుకుంటూ.

వియ్యన్నగారు ముక్కుకు సూటిగా మాట్లాడుకుపోయే మనిషి: ఇతర ప్రసంగం ఏమీ చెయ్యకుండానే అసలు

విషయంలోకివెళ్ళి ఇలా అన్నాడు....“సరే ఉత్తరంచూసు కుని నేనూ తగిన ఏర్పాట్లన్నీ చేస్తున్నాను. నువ్వు వ్రాసిన దానికి ఏలాటి అభ్యంతరమూ చెప్పేహక్కు నాకులేదు. ఇవాళ కాకపోతే రేపైనా వరలక్ష్మిని పంపక తప్పదుగా! ఒకమాట-ఇంతవరకూ నాలుగు ఉత్తరాలు గుప్పించినా నీకు తెలియనీలేదు. నిన్న మీబాబాయిగారు వ్రాసినదానికి నేనెట్టి సమాధానమూ యీయిదల్చలేదు. మూడువేలూ రేపే బ్యాంకునించి తీసుకుని టెలిగ్రాం మనియార్డరుద్వారా పంపెయ్యాలనుకుంటున్నాను

“ఇన్నాళ్ళూ ఇవ్వకుండా జాగుచేయడంలో నా స్వార్థం ఏమీ లేదని నీకు తెలిసే ఉంటుందేమో......

“వివాహం కాకపూర్వమే నీ చదువుకని నిర్ణయించిన ఈ ధనం ఇప్పుడు ఊరికే యిచ్చెయ్యమనడంలో మీవాళ్ళ ఉద్దేశం నాకు అర్థం కావడంలేదు. నిన్ను ఇంతటితో చదువుమాన్పించడంలో అర్థం ఏమిటో నాకెవరూ ఎప్పుడూ చెప్పలేదు.

“నలుగురి యెదటా ఇస్తానని వాగ్దానం చేసిన ఈ సొత్తు ఆనాడే మీ ఆధీనమైంది. ఇప్పుడు ఇవ్వననడానికి నైతికంగా నాకెలాటి అధికారమూ లేదు. అది ఎలాగైనా నీ పురోభివృద్ధికి పనికివచ్చేలాగున చూడాలనే నా కోరిక. అన్నిసంగతులూ మీరే స్వతంత్రంగా ఆలోచించుకోగలరు.

“ప్రస్తుతం నీవైఖరికి- ఎలాటిలాంఛనాలూ జరక్కుండానే వరలక్ష్మిని తీసుకువెడతానని బలవంతపెట్టడానికి- కారణం ఏమిటో అడగాలనుకోవడంలేదు. ఎలాగైనా ఎక్కడైనా మీరు సుఖంగా ఉండడమే నాకు కావాలి.”

వియ్యన్నగారు ఇక మాటాడలేదు. కుర్చీలో చేరగిలబడ్డాడు.

ఆయన మాటలు నాలుక చివర్నించి వచ్చినట్టివిగాలేవు. గుండెల్లోని ఆవేదనను కాగి కాగి బలవంతాన చల్లార్చుకోబడి ప్రతి పలుకూ బయటకు వచ్చినటువున్నది. కొలిమిలో కాలిన కొడవలి కాగులో ముంచినా కొంతసేపటివరకూ కాలుతూనే వుంటున్నటు అయన మాటల్లోవేడి తగ్గలేదు.

ప్రభాకర్ ఆసంగతి గుర్తించాడు కాని, ప్రస్తుతం తన ప్రయత్నం మానుకోలేదు. వరలక్ష్మిని తీసుకువెళ్ళితీరాలి, అందుకు ఆమెకూడా సిద్ధమయే వుంది.

ఇక తాన్న అంత కఠినవైఖరి అవలంబించడం, అందులో వియ్యన్నగారి మెత్తని మనస్సు గుర్తించకుండా, అది ఘోరమైనదని అతను మెదణించీ అనుకుంటూనేఉన్నాడు. ఇలాటి విధానాలద్వారా అసలే వ్యాకులం చెందివున్న ఆయనమనస్సును మరింత కలవరపెట్టడం తన అభిమతంకాదు. ఇప్పుడు వరలక్ష్మినికూడా తీసుకువెళ్ళుటలో ఆయనకు తను మహా అపచారమే చేస్తున్నాడు. ఈ మొగపిల్లల్నిద్దరితో యీ యింట్లో ఆయన ఉండలేడు. గుండె చెరువయేలా కుమిలిపోతాడు. అయినా తన ప్రయత్నం మానుకోలేక అన్నాడు, “మా బాబాయి వ్రాసినదానికి అర్థం లేదు. అయినా అది నాకోసం ప్రత్యేకించిన డబ్బుకదూ”

“న్యాయతః అంతే కావచ్చు. ఇప్పుడు వారితో వ్యవహారం నడిపే నిమిత్తంలేదు నా మనస్సుకు. రేపే పంపెయ్యాలనుకుంటున్నాను”

“అయితే నేనే తీసుకువెళ్ళానని వ్రాయండి !”

“ఎలాగైనా నాకు సమ్మతమే. మీ వాళ్ళు అందుకు అంగీకరిస్తే”

వరలక్ష్మి ఎందుకో గదిలో ఇటూ అటూ తచ్చాడుతూండగా చూశాడు వియ్యన్నగారు. “అమ్మాయీ !” అని పిల్చాడు. గుమ్మంలోకి వచ్చి దరవాజా ఆనుకు నుంచున్నది వరలక్ష్మి- “కావలసిన సామాన్లన్నీ జాగ్రత్తగా సర్దుకో అమ్మా!” అన్నాడు. “అమ్మలేదుకదా !” అని లోపల గొణుక్కున్నాడు వినపడీ వినపడకుండా. వరలక్ష్మి ఏమీ సమాధానం యియ్యకుండా గుమ్మానానుకుని అలాగే నిల్చునుంది. ప్రభాకర్ పెదవి కదల్చలేని స్థితిలో అలాగే ఉండిపోయాడు.

4

సుఖంగా చేరుకున్నటు ఆనాడే వియ్యన్నగారికి టెలిగ్రాం ఇచ్చాడు ప్రభాకర్.

నాలుగు రోజులకి బాబాయికి ఫ్లో ఉత్తరం రాశాడు. ప్రత్యేకంగా పిన్నికో చిన్న ఉత్తరం వ్రాసి ఉంచాడు